క్లుప్తంగా

లెక్చరర్‌కు సన్మానం



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకుడు బ్రహ్మేశ్వర్‌రెడ్డి నేషనల్ ఎలిజిబుల్ టెస్టులో అర్హత సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, అధ్యాపకులు సన్మానించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేషనల్ ఎలిజిబుల్ టెస్టులో బ్రహ్మేశ్వర్‌రెడ్డి అర్హత సాధించడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా ఈనెల 7నుంచి 13వ తేదీ వరకు దోస్త్ స్పెషల్ ఫేజ్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సురేష్‌బాబు, జగన్మోహన్, సమత, వనిత, వెంకటేష్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజు, శారద పాల్గొన్నారు.

విద్యార్థుల్లో మేధాశక్తి పెంచాలి

మల్దకల్: విద్యార్థుల్లో మేధాశక్తిని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని హెచ్‌ఎం ఇమ్మానియేల్ సూచించారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులకు సులభ పద్ధతుల్లో పాఠాలు బోధించి విద్యా సామర్థ్యం పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన భవనం అందుబాటులోకి తేవాలి



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల భవన నిర్మాణం పూర్తయి నెలల గడుస్తున్నా.. ప్రారంభించడం లేదని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సతీష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఏబీవీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలను నూతన భవనంలోకి మార్చకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కళాశాలలో విద్యార్థినుల సరిపడా బెంచీలు, ల్యాబ్ పరికరాలు, పుస్తకాలను ఏర్పాటు చేయడంతోపాటు నూతన భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ సురేష్, నరేష్, వంశీ, తేజ, వెంకటేష్, అనిల్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం వల్లూరుకు చెందిన గోపాల్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అబ్రహం, బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్.కిశోర్ గురువారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా గోపాల్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి వెంట వెంకట్రాములు, ఆనంద్, నాగన్న, గోపాల్, విజయ్ ఉన్నారు.

పనుల పరిశీలన



కొత్తకోట: పెబ్బేరులో చేపడుతున్న అభివృద్ధికి సంబంధించిన నిర్మాణ పనులను గురువారం ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా 6, 7వ వార్డులో శ్మశాన వాటికకు వెళ్లే సీసీ రోడ్ల నిర్మాణ పనులు, ఆస్పత్రి ఆవరణంలో కాంప్లెక్స్ మార్కింగ్ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, కమిషనర్ ఆదిశేషు, డీఈ శ్రీనివాస్, ఏఈ రమేష్ నాయుడు పాల్గొన్నారు.

బైక్ దొంగలు దొరికారు..

కొత్తకోట రూరల్: మండలంలోని పామాపురం, రామకృష్ణాపురం గ్రామాల్లో మంగళవారం రాత్రి రెండు బైక్‌లు చోరీ జరిగినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి రెండు రోజులుగా పట్టణ కేంద్రంలో పూర్తిస్థాయిలో వాహనాల తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగానే గురువారం ఉదయం సాయిబాబా ఆలయం సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై ముగ్గురు వెళ్తుండటంతో అనుమానం వచ్చి ఆపగా.. ఎలాంటి పత్రాలు చూపలేదు. దీంతో వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేయగా బైక్‌ను దొంగించడంతో పాటు రామకృష్ణాపురం, పామాపురం గ్రామాల్లో చోరీకి గురైన బైక్‌లను తామే చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. ఈ దొంగతనంలో ఆత్మకూర్‌కు చెందిన బోయ రమేష్, బర్రెమోని రాజు, మక్తల్ మండలం ముష్టిపల్లికి చెందిన జైనీ శివకుమార్ ఉన్నట్లు తేలిందన్నారు. వీరు దొంగిలించిన నాలుగు బైక్‌ను స్వాధీనం చేసుకోవడంతోపాటు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

రైతును రాజు చేయడమే లక్ష్యం



అలంపూర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గద్వాల రూరల్/మల్దకల్: రైతును రాజు చేయడమే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. రైతుల పంట రుణాలను మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో గురువారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అదేవిధంగా మల్దకల్ రైతువేదికలో రైతులతో ఎమ్మెల్యే సమావేశమై మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా రైతులకు హామీ మేరకు రుణమాఫీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రైతులతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, వైస్‌ఎంపీపీ పెద్ద వీరన్న, పీఏసీఎస్ చైర్మన్ తిమ్మారెడ్డి, మధుసూదన్ రెడ్డి, సీతారామిరెడ్డి, సత్యారెడ్డి, విక్రంసింహారెడ్డి, రామచంద్రారెడ్డి, రమేష్‌రెడ్డి, వెంకటన్న, వెంకటేశ్వర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నరేందర్, నారాయణ, అజయ్, మధు పాల్గొన్నారు.

● పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల మండలం గుంటిపల్లికి చెందిన నర్సింహులుకు రూ.60వేల ఎల్‌వోసీని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, చెన్నయ్య, కౌన్సిలర్లు శ్రీనివాసులు, మురళి పాల్గొన్నారు.

అలంపూర్: రైతుబాంధవుడు సీఎం కేసీఆర్ అని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. రైతుల పంట రుణాలను మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలోని గాంధీచౌక్‌లో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఉండవెల్లి, మానవపాడు, అలంపూర్, వడ్డేపల్లి మండలాల పార్టీ అధ్యక్షులు, రైతుబంధు సమితి అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వైస్‌చైర్మన్ శేఖర్‌రెడ్డి, పెద్ద మోక్తార్, దేవరాజు, మద్దిలేటి, అల్లబఖష్, శ్రీను, వెంకటస్వామి, ఫయాజ్, జితేందర్‌గౌడ్, ప్రేమదాసు, రాజు, సామెల్, అనిల్ పాల్గొన్నారు.

ధరూరు: రైతు రాజ్యం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని జెడ్పీటీసీ పద్మ, వైస్‌ఎంపీపీ సుదర్శన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దౌలన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కర్రెప్ప, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, దర్శెల్లి, విక్రంసింహారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, సంజీవ్, అబ్రహం, ఈదన్న పాల్గొన్నారు.

అయిజ: పట్టణంలోని రైతు సంఘం కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల అధ్యక్షుడు మేకల నాగిరెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమానికి సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ పాల్గొన్నారు.

కేటీదొడ్డి: దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా సీఎం కేసీఆర్ రూ.19వేల కోట్లతో రైతుల రుణాలను మాఫీ చేస్తున్నట్లు జెడ్పీటీసీ రాజశేఖర్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఉరుకుందు, ఉపాధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, చక్రధర్, వెంకన్నగౌడ్, కృష్ణ పాల్గొన్నారు.

మానవపాడు: రైతులకు రుణమాఫీ ప్రకటించడం హర్షణీయమని మండల నాయకులు దామోదర్‌రెడ్డి, వెంకట్రాములు అన్నారు. మండలకేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. హుస్సేన్, ఆనంద్‌బాబు, మద్దిలేటి, జగ్గుల శివరాముడు, జయ్యన్న, మహేష్ పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంతోపాటు ఆలూరు, బల్గెర, పెంచికలపాడు తదితర గ్రామాల్లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆలూరు శివారులోని వరి పొలంలో రైతులు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ విజయ్‌కుమార్, సర్పంచ్‌లు మల్లమ్మ, బల్గెర హన్మంతునాయుడు, శశికళ, ఎంపీటీసీ ఆనంద్‌గౌడ్, బస్వరాజు పాల్గొన్నారు.



మల్దకల్‌లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల



ధరూరులో..



కేటీదొడ్డిలో..

తల్లిపాలే బిడ్డకు అమృతం



తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్

గద్వాల అర్బన్: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని కౌన్సిలర్ వసీమాబేగం అన్నారు. జిల్లా కేంద్రంలోని 11వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. బిడ్డకు తల్లిపాలకు మించిన పౌష్టికాహారం లేదన్నారు. తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యంగా ఉండడంతోపాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని సూచించారు. ఆరునెలల వరకు తల్లిపాలే ఇవ్వాలన్నారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా ఆరోగ్య సూత్రాలు పాటించాలని కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బాలనర్సమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల బాధలు పట్టవా?

రాజోళి: ప్రభుత్వానికి హాస్టల్ విద్యార్థుల బాధలు పట్టడంలేదని కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని బాలుర వసతిగృహాన్ని గురువారం పరిశీలించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతిగృహంలో విద్యార్థులకు ట్రంక్ పెట్టెలు ఇవ్వడంలేదని, గదుల కొరతతో అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

దోమల నివారణకు చర్యలు



దోమల నివారణ మందును పిచికారీ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

అయిజ: మున్సిపాలిటీలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య అన్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో గురువారం మున్సిపల్ సిబ్బందిచే డ్రైయినేజీల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల వృద్ధి ఎక్కువగా ఉంటుందని, దోమకాటు వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతారన్నారు. లార్వా దశలోనే దోమల నియంత్రణకు డ్రైయినేజీల్లో మలాథిన్ మందు పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

ప్రతి విద్యార్థికీ రాగిజావ అందించాలి



గట్టు: ప్రభుత్వ పాఠశాలల్లో ఇక నుంచి ప్రతి విద్యార్థికీ రాగిజావ అందించాలని ఎంఈఓ కొండారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం రాగిజావ తయారీపై వంట ఏజెన్సీకి పలు సూచనలు చేశారు. వారంలో మూడు రోజులు విద్యార్థులకు 250 ఎంఎల్ రాగిజావ అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. హెచ్‌ఎం కొండారెడ్డి, రంగన్న పాల్గొన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

అయిజ: జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని అధ్యయన కేంద్రంలో ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కేంద్రం కోఆర్డినేటర్ ఎంఆర్‌ఎస్‌పీ శర్మ గురువారం ప్రకటనలో తెలిపారు. నిర్ణీత రుసుముతో ఈనెల 10 తేదీలోగా, అపరాధ రుసుముతో 31వ తేదీలోగా ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందాలని సూచించారు.

విరివిగా మొక్కలు నాటాలి

మానవపాడు: హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విరివిగా మొక్కలు నాటాలని ఎస్‌ఐ రాము సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారం కార్యక్రమంలో అందరూ భాగస్వాములై పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు.

వాహనాల తనిఖీ

ధరూరు: మండలంలోని కోతులగిద్ద–అల్వాలపాడు రహదారిపై గురువారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. రోడ్డు నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శివానందంగౌడ్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పారిశుద్ధ్యం లోపించొద్దు

అలంపూర్ రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని ఎంపీఓ చంద్రకళ అన్నారు. మండలంలోని ఊట్కూర్‌లో గురువారం పర్యటించి సెగ్రిగేషన్ షెడ్, నర్సరీ, డ్రైయినేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ డ్రైయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సర్పంచ్ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి నరేష్‌కు సూచించారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

అలంపూర్ రూరల్: పట్టణంలోని ఎరువుల, విత్తనాల దుకాణాలను గురువారం ఏఓ అనిత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులతో పాటు స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులకు నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. అనంతరం విత్తనాల శాంపిల్స్ సేకరించారు.

పశువులకు టీకాలు వేయించాలి



ఆవుకు టీకా వేస్తున్న వీఎల్‌ఓ వరప్రసాద్

శాంతినగర్: పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా టీకాలు వేయించాలని వెటర్నరీ డాక్టర్ పుష్పలత కోరారు. వడ్డేపల్లి మండలంలోని కొంకల, బుడమొర్సు గ్రామాల్లో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. 75మంది రైతులకు చెందిన 442 గేదెలు, 160 ఆవులు, ఎద్దులకు టీకాలు వేసినట్లు తెలిపారు. అదేవిధంగా దూడలకు నట్టల నివారణ మందులు తాగించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ వరప్రసాద్, లతీఫ్, రవి, వెంకటమ్మ, కృష్ణ, లక్ష్మన్న, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

కలకలం రేపుతున్న 'కండ్లకలక'

అలంపూర్ రూరల్: మండలంలోని గ్రామాల్లో కండ్లకలక కలకలం రేపుతోంది. అంటువ్యాధిలా వ్యాపిస్తుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వ్యాధి బారిన పడిన వారి కళ్లను చూస్తే అల్లుకుపోతుండడంతో ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నల్ల కండ్లద్దాలు ధరించి బయట తిరుగుతున్నారు. ఇంట్లో ఒకరికి వస్తే కుటుంబ సభ్యులంతా వ్యాధి బారిన పడుతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కండ్లకలక వచ్చిన వారు అత్యవసరంగా చికిత్స చేయించుకోవాలని మండల వైద్యాధికారిణి ప్రసూనరాణి సూచించారు. గతనెల 17 నుంచి వ్యాధి వ్యాపిస్తోందని, ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. నిర్లక్ష్యంగా ఉంటే వ్యాధి మరింత వ్యాప్తి చెందుతుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇందుకు సంబంధించిన చికిత్స, మందులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వ్యాధి వ్యాపించకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

మోదీ సారథ్యంలో సుపరిపాలన



కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న రాజగోపాల్

శాంతినగర్: ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్ అన్నారు. వడ్డేపల్లి మండలం రామాపురంలో మండల అధ్యక్షుడు నర్సింహ ఆధ్వర్యంలో గడపగడపకు బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. కేంద్ర పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలంపూర్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుధాకర్, నరేష్, ఈశ్వర్, రాముడు, మహేందర్, వెంకటేష్, నాగరాజు, తిక్కయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



అలంపూర్‌లో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ

అలంపూర్: ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మున్సిపాలిటీలోని హరిజనవాడ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 19ఏళ్లలోపు వారందరికీ తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలో 6,556 మందికి మాత్రలు వేసినట్లు మండల వైద్యాధికారిణి ప్రసూనరాణి తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్, హెల్త్ అసిస్టెంట్ అక్కమ్మ, శ్యామల, అంగన్‌వాడీ టీచర్ ఏమెలమ్మ, ఆశ కార్యకర్త చిట్టెమ్మ పాల్గొన్నారు.

అయిజ: చిన్నారుల్లో నులిపురుగులను నివారించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని మెడికల్ ఆఫీసర్ విష్ణు అన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల బెడద నుంచి రక్షణ పొందేందుకు 19 ఏళ్లలోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని తల్లిదండ్రులను కోరారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల, ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు వేశారు. మొత్తం 1,754 మంది విద్యార్థులకు మందులు వేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఎంపీపీ బీసమ్మ, వైస్‌ఎంపీపీ దేవన్న, సర్పంచ్ రేఖ, ప్రిన్సిపాల్ పద్మలత, ఏఎన్‌ఎంలు షాజహాన్, వినోదిని పాల్గొన్నారు.

రాజోళి: ఆల్బెండజోల్ మాత్రలతో నులి పురుగులకు చెక్ పెట్టవచ్చని మెడికల్ ఆఫీసర్ మధుబాబు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మల్దకల్: విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై దృష్టి సారిస్తారని డాక్టర్ స్వరూపరాణి అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యం సంరక్షణ కోసం ముందు జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: 19ఏళ్లలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని ఏఎన్‌ఎం సురేఖ తల్లిదండ్రులకు సూచించారు. మండలంలోని నందిన్నె పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవేంద్ర, వెంకటేష్, స్వర్ణలత, నవిత, భారతి, శిరీష, పావని, ఉషారాణి, శ్రీదేవి పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఎంపీపీ విజయ్‌కుమార్, మండల వైద్యాధికారి హరీశ్‌కుమార్ విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండలంలో 95శాతం విద్యార్థులకు మాత్రలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ హుస్సేని, ఏఎన్‌ఎం పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం షేక్‌పల్లి పాఠశాలలో సర్పంచ్ రవీందర్‌రెడ్డి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రాజోళిలో మాత్రలు వేస్తున్న డాక్టర్ మధుబాబు



అయిజలో..

కుల ధ్రువీకరణ పత్రాలు తహసీల్దార్‌చే జారీ చేయాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న మాదాసి, మాదారి కుర్వ సంఘం నాయకులు

అలంపూర్: తహసీల్దార్ ద్వారా మాదాసి, మాదారి కుర్వలకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే అబ్రహం ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదాసి, మాదారి కుర్వలకు స్థానిక తహసీల్దార్ నుంచి కుల ధ్రువీకరణ పత్రాలు ఇప్పించాలని, అర్హులందరికీ గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలని కోరారు. స్పందించిన మంత్రి.. సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

వరద బాధితులను ఆదుకోవాలి



మానవపాడులో వరద సహాయనిధికి విరాళాలు సేకరిస్తున్న నాయకులు

మానవపాడు: వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు కోరారు. మండల కేంద్రంలో గురువారం వరద సహాయనిధి కోసం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వరదసాయం పెంచడంతోపాటు జాతీయ విపత్తు నిధులు విడుదలయ్యేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, రామాంజనేయులు, మాలిక్‌బాషా పాల్గొన్నారు.

అద్దె భవనంలో విద్యార్థుల అవస్థలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం అద్దె భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. కేవీపీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో వసతిగృహంలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. అద్దె భవనంలో సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సోషల్ వెల్ఫేర్ అధికారులు స్పందించి సొంత భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు వెంకటేష్ పాల్గొన్నారు.